
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
మంగళవారం 8 అక్టోబరు 2024



తొలిమెట్టు.. తడబాటు

తూతూ మంత్రంగా అమలు

- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు
- ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులతో బ్రేక్
- ఈయేడు ఇప్పటి వరకు ఇవ్వని శిక్షణ
- కరోనా అనంతరం పిల్లల్లో తగ్గిన విద్యా సామర్థ్యాలు
- మెరుగుపరచడమే లక్ష్యంగా తొలిమెట్టు
- పట్టింపులేక నీరుగారుతున్న లక్ష్యం

హనుమకొండ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కరోనా కాలంలో చదువులో వెనుకబడిన విద్యార్థుల్లో విద్యాసామర్థ్యాలను మెరుగుపరిచేందుకు ఉద్దేశించి విద్యాశాఖ ప్రవేశ పెట్టిన తొలిమెట్టు కార్యక్రమం ఉమ్మడి వరంగల్ జిల్లాలో తూతూ మంత్రంగా అమలవుతోంది. కొన్ని పాఠశాలల్లో అది కూడా లేదు. దీనితో కార్యక్రమం లక్ష్యం నీరుగారి పోతోంది. కరోనా ప్రభావం విద్యా రంగంలో తీవ్ర ప్రభావం చూపింది. కొవిడ్ ప్రజల ఆరోగ్యాన్ని ఎంత సంక్షోభంలోకి నెట్టిందో అంతకన్నా ఎక్కువ నష్టాన్ని పాఠశాల విద్యకు కలిగించింది. పాఠశాల విద్యలో ప్రాథమిక దశలోని విద్యార్థులు వారివారి తరగతులకు చెందిన సామర్థ్యాలను సాధించగలిగినప్పుడే నాణ్యమైన విద్య సాకరమవుతుంది. కరోనా కాలంలో ఆన్‌లైన్ తరగతుల ద్వారా ఇంట్లోనే ఉండి విద్యార్థులు చదుకోవలసిన పరిస్థితి వచ్చింది. కరోనా తగ్గి పరిస్థితులు సానుకూలించి పాఠశాల విద్య తిరిగి గాడిలో పడిన తర్వాత చిన్నారుల్లో విద్యా సామర్థ్యాలను పరిశీలిస్తే దారుణంగా పడిపోయినట్టు గుర్తించారు. విద్యార్థుల్లో చదవడం, రాయడం. అక్షరాలను గుర్తించడం లెక్కలు చేయడం రానివారు అనేక మంది ఉన్నట్టు ఒక అధ్యయనంలో తేలింది. దీనిని గుర్తించిన విద్యాశాఖ అటువంటి విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాలను పెంచాలని నిర్ణయించుకు న్నది. ఇందులో భాగంగా 2022-23 విద్యా సంవత్సరం నుంచి తొలిమెట్టు (ఎఫ్ఎల్ఎన్-ఫౌండేషన్,లిటరజీ, న్యూమ రసీ) పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. గత ఏడాది ఈ కార్యక్రమాన్ని పగడ్బందీగా అమలు చేయడంతో పిల్లల్లో విద్యా సామర్థ్యాలు కొంత మేరకు మెరుగయ్యాయి.

ఒకటి నుంచి ఐదు తరగతుల విద్యార్థులకు..

ఉమ్మడి జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లోని ఒకటి నుంచి ఐదు తరగతుల విద్యార్థులకు తొలిమెట్టు కార్యక్రమం అమలు చేస్తారు. మౌలిక భాష, గణిత సామర్థ్యాల సాధనకు అవసరమైనట్టుగా వారంలో ఐదు రోజుల పాటు బోధన చేయడం, ఒక రోజు పరీక్ష నిర్వహించాలి. బేస్‌లైన్ టెస్ట్ నిర్వహించి విద్యార్థులను విభ జించి కృత్యాల బోధన చేయడం, పిల్లల భాగస్వామ్యం, ప్రతిస్పందనలు, స్లిప్‌టెస్ట్, రాత పనులు అంతర్భాగంగా నిర్వహిం చాలి. యాప్‌లో వివవరాలను నమోదు చేయాలి. కానీ ఇదేమీ ఉమ్మడి జిల్లాలోని పాఠశాలల్లో సంపూర్ణంగా జరగడం లేదు. అంతా తూతూమంత్రంగా నిర్వహిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత బడులు	
హనుమకొండ	492
జనగామ	508
జయశంకర్ భూపాలపల్లి	432
మహబూబాబాద్	898
ములుగు	353
వరంగల్	645

తొలిమెట్టు అమలు ఇలా..

విద్యాసంవత్సరంలో 220 రోజుల పనిదినాలు ఉండగా, 140 రోజులు బోధనాభ్యాసన ప్రక్రియ నిర్వహించాలి. వారానికి ఐదురోజులు బోధనాభ్యాసం, ఒక రోజు మూల్యాంకనం, పునరభ్యాసం, చేయించాలి. విద్యార్థులంతా భాగస్వాములు అయ్యేలా వార్షిక, పాఠ్య, వారపు, రోజువారి కాలాంశం లేదా పీరియడ్ ప్రణాళిక రూపొందించాలి. 1వ తరగతిలో విద్యార్థులు నిమిషానికి 20 పదాలను, 2వ తరగతిలో 25 పదాలను, 3వ తరగతిలో 30 పదాలను, 4వ తరగతిలో 40 పదాలను, 5వ తరగతిలో 50 పదాలను ధారాళంగా చదవాలి. 3,4,5 తరగతుల్లోని విద్యార్థులు ఇచ్చిన పేరాను లేదా గేయాన్ని లేదా పద్యాన్ని చదివి అర్థం చేసుకోగలగాలి. దీనిని పరీక్షించడానికి 5 ప్రశ్నలిస్తే వాటిల్లో 4 చేయగలగాలి. 1వ తరగతి పిల్లలు సరళపదాలు గుణింత పదాలు, 2వ తరగతి వారు ఒత్తుల పదాలు, 3 నుంచి 5వ తరగతి పిల్లలు 4 లేదా 5 వ్యాక్యాలతో కూడిన పేరాలను రాయగలగాలి. 5పదాల్లో కనీసం 4 పదాలను తప్పుల్లేకుండా రాయాలి. ఉపాధ్యాయులు ప్రతీ పీరియడ్‌కు పాఠ్య ప్రణాళికలు తయారు చేసి దాని ప్రకారమే బోధించాలి. విద్యార్థులు సాధించాల్సిన లక్ష్యాలను ముందే అంచనా వేసి లక్ష్యాలను సాధించేలా చేయాలి. ఒక్కో పాఠ్యాంశాన్ని రెండు మూడు భాగాలుగా విభజించి విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేలా బోధించాలి. తెలుగు, హిందీ, ఇంగ్లీష్ లాంటి బాషల బోధనలోనూ టీచర్లు బోధన ఉపకరణా లను విరివిగా ఉపయోగించాలి. బోధన ఉపకర ణాల తయారీని ప్రోత్సహించేందుకు టీచింగ్ లర్నింగ్ మెటీరియల్ మేళాలు నిర్వహించాలి.

నాలుగంచెల్లో నిర్వహణ..

తొలిమెట్టు పర్యవేక్షణ బాధ్యత జిల్లా విద్యాశాఖాధికారి నుంచి కాంప్లెక్స్ జీహెచ్ఎంలు నాలుగు స్థాయిలో ఉంటుంది. కాంప్లెక్స్ హెచ్ఎం వారి కాంప్లెక్స్ పరిధిలోని అన్ని పాఠశాలను నెలకోసారి పర్యవేక్షించాలి. ఎంఎన్‌వో (మండల నోడల్ అధికారి)లు ప్రతీ ఆదివారం రెండు రోజుల పాటు పరిశీలించాలి.

ఎంఈవోలు నెలలో 50శాతం పాఠశాలలు పరిశీలించాలి. సెక్టోరల్ అధికారులు వారికి కేటాయించిన మండలాల్లో నెలకు పది పాఠశాలలు, జిల్లా విద్యాశాఖాధికారి నెలకు అయిదు పాఠశాలలు పరిశీ లించాల్సి ఉంటుంది. అలాగే ప్రతీ నెలా మండల స్థాయి, జిల్లా స్థాయి సమీక్షలు చేపట్టాలి. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. బృందాల పరిశీలన లేదు. జిల్లాలో సగం మంది ఉద్యోగోన్నతులు వచ్చిన జీహెచ్ఎం లున్నారు. వీరికి శిక్షణ ఇవ్వలేదు. కొన్ని చోట్ల ఉపాధ్యాయుల కొరత కూడా నెలకొనడంతో అమలుపై నీలినీడలు కమ్ముకున్నాయి. దీని ఫలితంగా విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాలపై ప్రభావం పడుతోంది.

దృష్టి సారించని యంత్రాంగం

ప్రస్తుత విద్యాసంవత్సరం ఉమ్మడి జిల్లాలో విద్యాశాఖాధికారులు తొలిమెట్టుపై దృష్టిసారించలేదు. బడులు ప్రారంభమైన మూడు నెలలు గడుస్తున్నా.. చాలా పాఠశాలల్లో తొలిమెట్టు నామమాత్రంగానే అమలవుతోంది. అనేక ఆటంకాల మధ్య ఈ కార్యక్రమం కుంటినడక నడుస్తోంది. ఉపాధ్యాయుల బదిలీలతో తొలిమెట్టుకు దాదాపు బ్రేకపడింది. ఉద్యోగుల పదోన్నతులతో అమలు పర్యవేక్షణ కొరవడింది. వాస్తవంగా ఈ ఏడాది తొలిమెట్టు అమలుపై ఉపాధ్యాయులకు శిక్షణే ఇవ్వలేదు. దీనితో చదవడం, రాయడం, లెక్కలు చేయడంలో వెనుకబడి ఉన్న విద్యార్థులను గుర్తించే ప్రక్రియ అటకెక్కినట్టయింది.



రాజరాజేశ్వరి మహా లలిత త్రిపుర సుందరి అలంకరణలో అమ్మవారు

రాజరాజేశ్వరి మహా త్రిపుర సుందరిగా భద్రకాళి

- ఐదో రోజుకు దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు

వరంగల్ కల్చరల్, అక్టోబరు 7: దేవీ శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా సోమవారం భద్రకాళి దేవస్థానంలో అమ్మవారిని రాజరాజేశ్వరి లలిత మహా త్రిపుర సుందరిగా అలంకరించారు. ప్రత్యేక పూజల అనంతరం స్కందమాత క్రమంలో పల్లకీపై ఉదయం అమ్మవారిని ఊరేగించారు. సాయంత్రం శేష వాహనంపై ఊరేగించారు. అమ్మవారిని దర్శించుకున్న వారికి సమస్త భోగాలు కలుగుతాయని, యోగా సిద్ధి కలుగుతుందని ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు తెలిపారు. దేవీనవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు సోమవారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తన కుటుంబ సభ్యులతో అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక హోమాల పూజలో పాల్గొన్నారు. కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో శేషు భారతి, ప్రధానార్చకులు భద్రకాళి శేషు తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేశారు. భద్రకాళి సేవా సమితి కన్వీనర్ ఐతా గోపీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి మహా పూజ అనంతరం ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ విజయ్‌కుమార్, కూచన హరినాథ్, శ్యామ్ సుందర్, అశోక్ పాల్గొన్నారు.



లాంగ్‌జంప్‌లో పాల్గొన్న క్రీడాకారిణి

అట్టహాసంగా రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ప్రారంభం

- పోటీలను ప్రారంభించిన స్పోర్ట్స్ ఓఎస్డీ రవీందర్ రెడ్డి
- కొత్తక్రీడా పాలసీ తెచ్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని వెల్లడి



వివరాలు : 7లో..

డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థుల జాబితా ప్రదర్శన నేడు

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 7: డీఎస్సీ-2024లో ఉపాధ్యాయ ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థుల జాబితాను వరంగల్ డీఈవో వెబ్‌సైట్‌లో మంగళవారం సాయంత్రానికల్లా పొందుపరస్తామని డీఈవో మామిడి జ్ఞానేశ్వర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు బుధవారం ఉదయం 7 గంటలకు హనుమకొండలోని వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్దకు చేరుకోవాలని తెలిపారు. అక్కడ నుంచి హైదరాబాద్ వెళ్లేందుకు బస్సులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులందరూ వారి పాస్‌పోర్టు సైజ్ ఫొటోతో హాజరు కావాలని, బస్సు ఎక్కే ముందే అభ్యర్థుల ఫొటోలను డీఈవో కార్యాలయ సిబ్బందికి అందజేసి ఐడెంటిటీ కార్డును తీసుకోవాలని తెలిపారు. వరంగల్ నుంచి బస్సులో బయలుదేరి హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా వారి నియామక పత్రం అందుకోవాలని ఆయన సూచించారు.

ప్రగతిలో ప్రతీ ఒక్కరు భాగస్వాములే

- రూ.2 వేల కోట్ల టర్నోవర్ సాధించడం అభినందనీయం
- డీసీసీ బ్యాంకు సమావేశంలో టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు



కేక్ కట్ చేస్తున్న టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

హనుమకొండ సిటీ, అక్టోబరు 7 : డీసీసీ బ్యాంకు రూ.2వేల కోట్ల టర్నోవర్‌ను సాధించడం అభినంద నీయమని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు పేర్కొన్నారు. సోమవారం హనుమకొండ నక్కలగు ట్టలోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో సీఈవో, మేనేజర్ల సమావేశం జరిగింది. రూ.2వేల కోట్ల టర్నోవర్ సాధించడాన్ని పురస్కరించుకొని రవీందర్‌రావు కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. టర్నోవర్ లక్ష్యాన్ని ముందుగానే నిర్దేశించుకొని ఆ మేరకు సాధించినట్లు వెల్లడించారు. ఈ విజయంలో బ్యాంకు అధికారులు, సిబ్బంది, సహకార సంఘాలు, ఖాతాదారులు ఇలా ప్రతీ ఒక్కరు భాగస్వాములే అన్నారు. లక్ష్య సాధనలో ఎవరి పాత్రను వారు పోషించి బ్యాంకు పేరు ఉన్నత స్థాయికి తీసుకెళ్లారన్నారు. రుణమాఫీ పొందిన రైతులకు తిరిగి కొత్త రుణాలు మంజూరు చేయాలని బ్యాంకు అధికారులకు సూచించారు. బ్యాంకింగ్ సేవల్లో ఎలాంటి జాప్యం ఉండరాదన్నారు.

రుణమాఫీలో ఆధార్ కార్డు, ఇతరాత్ర తప్పుల సవరణలను పరిశీలించి అర్హులైన రైతులకు త్వరగా లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్హుల జాబితాలను ప్రభుత్వానికి సమర్పించడంలో జాప్యం చేసిన సంఘాల సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వివిధ రకాల రుణాలు, రికవరీ, డిపాజిట్లు తదితర అంశాలపై రవీందర్‌రావు అధికారులతో సమీక్ష జరిపి దిశా, నిర్దేశం చేశారు. సమావేశంలో సీఈవో వజీర్ సుల్తాన్, జీఎం ఉషా, డీజీఎం అశోక్, ఏజీఎం మధు, స్రవంతి, కృష్ణమోహన్, రాజు నాయక్ తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భీమునిపాదంలో పర్యాటకుల సందడి

గూడూరు, అక్టోబరు 7: గూడూరు మండలం సీతానగరం శివారు కొమ్ములవంచ సమీప అటవీ ప్రాంతంలో ఉన్న భీమునిపాదం జలపాతం జలసవ్వడిగా మారింది. సోమవారం ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షానికి 70ఫీట్ల ఎత్తు నుంచి వాటర్ ఫాల్స్ జాలువారుతున్నాయి. దీంతో ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల నుంచి వచ్చిన పర్యాటకులు వాటర్ ఫాల్స్ కింద తడుస్తూ కేరింతలు కొట్టారు. సిబ్బంది భద్రత చర్యలు చేపట్టారు.



బీసీలంతా ఏకతాటిపైకి రావాలి

- ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య
- మాస్టర్జి కళాశాలలో ధూంధాం సన్నాహక సమావేశం
- బీసీ జేఏసీ చైర్మన్‌గా సుందర్‌రాజ్ ఏకగ్రీవ ఎన్నిక



సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న సారయ్య

రాంనగర్, అక్టోబరు 7 : రాజ్యాధికారం కోసం బీసీలంతా ఏకతాటిపైకి రావాలని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య పిలుపునిచ్చారు. సోమవారం హనుమకొండలోని మాస్టర్జీ కళాశాలలో బీసీ జేఏసీ కన్వీనర్, మాజీ కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ అధ్యక్షతన బీసీ ధూంధాం సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశంలో 14 మండలాలకు చెందిన బీసీ ప్రతినిధులు హాజరయ్యారు. సంగంరెడ్డి సుందర్ రాజ్‌ను బీసీ జేఏసీ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బస్వరాజ్ సారయ్య మాట్లాడుతూ.. రాజ్యాధికారం కోసం బీసీలంతా ఏకతాటిపైకి వచ్చి పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. అగ్రవర్ణాలు బీసీలను చీల్చి వారి పీఠాలు పదిలం చేసుకుంటున్నారని ఆరోపించారు. అగ్రవర్ణాల కుట్రలు ఇప్పటికైనా అర్థం చేసుకుని ఏకం కావాలన్నారు. బీసీలకు రాజ్యాధికారం కావాలంటే కులగణన ఏకైక పరిష్కార మార్గమని సారయ్య తెలిపారు. బీసీ జేఏసీ చైర్మన్‌గా ఎన్నికైన సుందర్‌రాజ్ మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా బీసీ కులగణన చేయాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లు సాధించాలంటే గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు బీసీ సంఘాలు ఏకం కావాలన్నారు. బీసీ ఉద్యమం బలోపేతం కావాలంటే స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. వార్డు సభ్యుడి నుంచి సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ వరకు బీసీలు విజయం సాధించేలా శ్రమిద్దామన్నారు. అగ్రవర్ణాల పునాదులను గ్రామ స్థాయి నుంచి పెకిలిద్దామని సుందర్‌రాజ్ సూచించారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ గడ్డం భాస్కర్, డా.కాశీప్రసాద్, వేణు మాధవ్‌గౌడ్, పులి రజనీకాంత్, నరేడ్ల శ్రీధర్, మునిగాల సమ్మయ్య, కావటి స్వామి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులపై జాప్యం తగదు

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- బల్దియా గ్రీవెన్స్‌లో ఫిర్యాదుల వెల్లువ

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 7 : ప్రజావాణి ఫిర్యాదులు చాలా రోజులుగా పెండింగ్‌లో ఉంటున్నాయని, తరుచుగా వస్తున్న ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని లేదంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను హెచ్చరించారు. సోమవారం వరంగల్ బల్దియా కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ప్రజావాణి (గ్రీవెన్స్ సెల్) కార్యక్రమాన్ని పురస్కరించుకుని గ్రేటర్ వరంగల్ పరిధిలోని 66 డివిజన్ల ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కమిషనర్ నేరుగా ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదుదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించిన తర్వాత వెంటనే ఆయా విభాగాల అధికారులను పిలిచి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగిన గ్రీవెన్స్‌లో 70 ఫిర్యాదులు స్వీకరించినట్టు కమిషనర్ అశ్విని తానాజీ వాకడే వెల్లడించారు. ఎస్ఈలు ప్రవీణ్‌చంద్ర, రాజయ్య, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, ఇన్‌చార్జి సీపీ రవీంద్ర రాడేకర్, డీసీపీలు కృష్ణారెడ్డి, ప్రసన్నరాణి, బయాలజిస్ట్ మాధవరెడ్డి, డీఎఫ్‌వో శంకర్ లింగం, టీపీఆర్‌వో కోళ రాజేశ్‌కుమార్, టీవో బిర్రు శ్రీనివాస్‌లతో పాటు వివిధ విభాగాల వింగ్ అధికారులు పాల్గొన్నారు.ఇంజనీరింగ్ విభాగానికి 17, హెల్త్, శానిటేషన్ - 9, ప్రాపర్టీ ట్యాక్స్ రెవెన్యూ - 8, టౌన్‌ప్లానింగ్ - 33, హార్టికల్చర్ - 2 మొత్తం 70 దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు తెలిపారు.



గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ అశ్విని

- కాశిబుగ్గ మధురానగర్‌లో అంతర్గత రోడ్లు, డ్రైనేజీలు లేకపోవడంలో వల్ల చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు.
- వరంగల్ పుప్పాలగుట్ట ప్రాంతంలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయని కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు.
- వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో చేపలు విక్రయించే చోట చేపల మార్కెట్‌లు ఏర్పాటు చేసి వ్యాపారులకు సహకరించాలని తెలంగాణ మత్స్య సంఘం జిల్లా నాయకులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.
- గ్రేటర్ వరంగల్ 65వ డివిజన్ చింతగట్టు గ్రామంలో శ్మశాన వాటిక లేకపోవడం వల్ల స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు స్పందించాలని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

వంద కొట్టు.. పొట్టేలు పట్టు


అప్పల్‌రావుపేటలో దసరా లక్కీ ధమాకా



దసరా అంటనే మాంసం, మద్యం ప్రియులకు ఎంతో ప్రియమైన పండుగ. ఇలాంటి సమయంలో విజయదశమి కానుక లంటూ నెక్కొండ మండలంలోని అప్పల్‌రావుపేట గ్రామంలో పంచుతున్న కరపత్రాలు చర్చనీయాంశమయ్యాయి. రూ.100తో ఇచ్చి కూపన్ తీసుకుని లక్కీడ్రాలో గొర్రెపోతు గెలుచుకోవచ్చని, కానీ 250 కూపన్లు మాత్రమే ఉన్నాయని కొందరు వ్యక్తులు ప్రచారం చేస్తున్నారు. ఇప్పుడిది సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. మొదటి బహుమతి పొట్టేలు కాగా మద్యం, శీతల పానీయాలు, వంట నూనె ప్యాకెట్లు, గోధుమపిండి తదితర పలురకాల వస్తువులు మొత్తం 20 బహుమతులున్నట్టు కరపత్రాల్లో పేర్కొన్నారు. పండుగ ముందు రోజు ఈ నెల 11 న లక్కీడ్రా తీయనున్నట్టు ప్రకటించడంతో అప్పల్‌రావుపేట పరిసర గ్రామాల ప్రజలు కూపన్ల కోసం ఎగబడుతున్నారు.

- నెక్కొండ

ఆరునెలలవుతున్నా.. అందలే..



- బెనిఫిట్స్ కోసం రిటైర్డ్ ఉద్యోగుల ఎదురుచూపు
- ఉమ్మడి జిల్లాలో గత ఆరు నెలల్లో 437 మంది పదవీ విరమణ
- పెన్షన్ మంజూరుతోనే సరిపెడుతున్న సర్కారు
- రూ.30లక్షల నుంచి రూ.70లక్షల వరకు రావలసి ఉన్న బెనిఫిట్స్
- అధికారులు ఫైళ్లు పంపుతున్నా క్లియర్ చేయని ఫైనాన్స్ డిపార్టుమెంట్
- ఆర్థిక ఇబ్బందులతో రిటైర్డ్ ఉద్యోగులు సతమతం

హనుమకొండ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : పదవీ విరమణ పొందిన ఉద్యోగి దంపతులను ఘనంగా సత్కరించి.. వారికి రావలసిన రిటైర్మెంట్ బెనిఫిట్లలో కొన్నింటిని అదే రోజు చెల్లించి దర్జాగా సాగనంపుతారు. ఇది నిన్నటి మాట. ఇప్పుడా పరిస్థితి లేదు. ఆయా ప్రభుత్వ శాఖల్లో రిటైర్ అయిన ఉద్యోగుల దంపతులకు సన్మానాలు చేసి.. ఉత్తి చేతులతో సాగనంపుతున్నారు. అలా ఉమ్మడి జిల్లాలో సుమారు 437మంది రిటైర్డ్ ఉద్యోగులు తాము పదవీవిరమణ చేసి ఆరు నెలలవుతున్నా ప్రయోజనాల నుంచి ఒక్క పైసా కూడా అందక ట్రెజరీ, ఫైనాన్స్ డిపార్టుమెంట్ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ఈ ఏడాది మార్చి ఆగస్టు మధ్య కాలంలో పదవీ విరమణ చేసిన ఉద్యోగుల దయనీయ పరిస్థితి ఇది. వారికి ఇప్పటి వరకు బెనిఫిట్స్ ఏవీ రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రిటైర్మెంట్ కాగానే ఆ వచ్చిన డబ్బుతో తమ కుటుంబ అవసరాలను తీర్చుకోవాలని, పోగా మిగిలిన మొత్తంతో శేష జీవితాన్ని ప్రశాంతంగా గడపాలనుకునే వారు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం వారికి పెన్షన్ మంజూరు చేసి చేతులు దులుపుకొంటోంది. రిటైర్ అయిన ఉద్యోగికి గ్రాట్యుటీ, వేతనం నుంచి నెల నెలా దాచుకున్న జనరల్ ప్రావిడెంట్ ఫండ్ (జీపీఎఫ్) డబ్బు చెల్లించడం లేదు. అలాగే గ్రూప్ ఇన్సూరెన్స్ (జీఎల్ఐ), కమ్యుటేషన్, సరెండర్ లీవులు తదితర రూపేణా ఇవ్వాల్సింది కూడా ఇప్పటి వరకు చెల్లించలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఏకంగా 4 డీఏల మొత్తం ఉద్యోగులకు బకాయి ఉంది. ప్రస్తుతం పని చేస్తున్న ఉద్యోగులకు ఎలాగూ ఇవ్వడం లేదు. కనీసం పదవీ విరమణ పొందిన వారికైనా సకాలంలో చెల్లిస్తే అయినా కొంత మేరకైనా వారికి ఉపశమనంగా ఉండేది. అదీ లేదు. కొత్త ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నందు వల్ల రిటైర్ అయిన ఉద్యోగులకు సకాలంలో బెనిఫిట్స్ చెల్లించలేకపోతుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. కాకపోతే అన్నీ ఒక సారి కాకపోయినా విడతల వారీగా అయినా చెల్లించాలి కదా రిటైర్ అయిన ఉద్యోగులు వాపోతున్నారు.

437 మంది రిటైర్

గత బీఆర్ఎస్ ప్రభుత్వం రిటైర్మెంట్ వయసును మూడేళ్ల క్రితం 58 నుంచి 61 సంవత్సరాలకు పెంచింది. ఆ గడువు ఈ ఏడాది మార్చితో ముగిసింది. అప్పటి నుంచి ప్రతీ నెల ఉమ్మడి వరంగల్ జిల్లాలో గరిష్ఠంగా 60 నుంచి 70 మంది వరకు రిటైర్ అవుతూవస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది ఉపాధ్యాయులు, పంచాయతీరాజ్ ఉద్యోగులున్నారు. సాధారణంగా రిటైర్ అయిన ఉద్యోగులు పనిచేసిన కాలంలో జమ చేసుకున్న జీపీఎఫ్‌తో పాటు ఇతర ప్రయోజనాలు అన్నింటిని కలిపి రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌ను ప్రభుత్వం అందజేస్తుంది. ఉద్యోగి రిటైర్‌మెంట్ గడువు సమీపిస్తున్న సమయంలో వారికి సంబంధించిన అన్ని వివరాలను సేకరించి వాటి ఆధారంగా రిటైర్‌మెంట్ తర్వాత వారం పది రోజులు, గరిష్ఠంగా నెల రోజుల వ్యవధిలో అన్ని ప్రయోజనాలను అందచేస్తూ వచ్చేది. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రిటైర్‌మెంట్ అయిన ఉద్యోగులకు ఏడు నెలలు గడిచినా బెనిఫిట్స్ మంజూరు చేయడం లేదు. దీంతో వారు, వారి కుటుంబాల అవస్థలు పడుతున్నారు. రిటైర్ అయ్యాక వచ్చే మొత్తాన్ని లెక్కలేసుకొని పిల్లల వివాహాలు, ఇంటి నిర్మాణం, తదితర అవసరాల కోసం ప్రణాళికలు రూపొందిచుకున్న వారు సొమ్ము చేతికి అందుతుందన్న భరోసాతో అప్పులు చేసి కార్యాలను గట్టెక్కించుకున్నవారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

ఉమ్మడి జిల్లాలో గత ఆరునెలల్లో పదవీవిరమణ పొందినవారి సంఖ్య
హనుమకొండ : 110
వరంగల్ : 90
జనగామ : 75
మహబూబాబాద్ : 80
ములుగు : 40
జయశంకర్ భూపాలపల్లి : 42
మొత్తం : 437

సంబంధిత శాఖలకు ఫైళ్లు వెళ్తున్నా..

పదవీ విరమణ చేసిన ఉద్యోగికి సంబంధించిన అన్ని రకాల బెనిఫిట్స్‌పై ఆయా శాఖలు ఫైళ్లు తయారు చేసి ఆర్థిక శాఖకు పంపుతాయి. అక్కడ ఒకే చేస్తే ట్రెజరీ నుంచి సంబంధిత రిటైర్డ్ ఉద్యోగి బ్యాంకు అకౌంట్‌లో సొమ్ము జమ అవుతుంది. ఆయా శాఖలు రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ ఫైళ్లు సకాలంలో పంపిస్తున్నా వాటిని ఫైనాన్స్ డిపార్టుమెంట్ క్లియర్ చేయడం లేదన్న ఆరోపణలు వినవస్తున్నాయి. దీంతో రిటైర్డ్ ఉద్యోగులు ట్రెజరీలు, ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ చుట్టూ కాళ్లరిగేలా తిరుతున్నారు. ఫైనాన్స్ నుంచి అప్రూవల్ ఇస్తే ఖాతాల్లో డబ్బులు వేస్తామని ట్రెజరీ వాళ్లు, సర్కార్ ఫండ్స్ ఇస్తే అప్రూవ్ ఇస్తామని ఫైనాన్స్ వాళ్లు చెప్పి తిప్పి పంపుతున్నారు. రిటైర్ అయిన ఉద్యోగులకు పెన్షన్ ఒక్కటే మంజూరు చేయమని మాత్రమే ఆదేశాలు వచ్చాయనీ, మిగతా బెనిఫిట్స్ విషయంలో తమకు ఎలాంటి మార్గదర్శకాలు రాలేదని ట్రెజరీ అధికారులు చెబుతున్నారు.

వడ్డీ నష్టం.. అదే భారం..

విరమణ చెందిన ఉద్యోగికి గ్రాచ్యుటీ, వేతనం నుంచి ప్రతి నెలా ప్రభుత్వం వద్ద పొదుపు చేసుకున్న జనరల్ ప్రావిడెంట్ ఫండ్, గ్రూప్ ఇన్సూరెన్స్, కమ్యూటేషన్, సరెండర్ లీవులు తదితర రూపేణా ఇవ్వాల్సి ప్రయోజనాల సొమ్ము ఏక మొత్తంలో విరమణ చెందిన ఉద్యోగులకు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంటుంది. ఎంత చిన్న ప్రభుత్వ ఉద్యోగికి అయినా కనీసం రూ.35 లక్షల నుంచి రూ.70లక్షల వరకు పెన్షన్ బెనిఫిట్స్ ప్రభుత్వం చెల్లించాల్సి వస్తుంది. వీటిని చెల్లించడంలో ఆలసమైనా వడ్డీ ఏమైనా ఇస్తుందా అంటే అలాంటిదేమి లేదు. విరమణ పొందిన ఉద్యోగి ఆరు నెలల కాలానికి తన బెనిఫిట్స్‌కు సంబంధించి ఒక రకంగా బ్యాంకు వడ్డీ చొప్పున లెక్క గట్టినా రూ.3లక్షల నుంచి రూ.5లక్షల వరకు నష్టపోయినట్టే. ఈ ఏడు నెలల కాలంలో విరమణ చెందిన అధికారులు ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించి ఉమ్మడి వరంగల్ జిల్లాలో వివిధ రకాల చెల్లింపులు, బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇక కొందరు బయట తెచ్చిన అప్పులకు వడ్డీ భారం పెరుగుతోందని తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రిటైర్ అయిన ఉద్యోగులతో పాటు సర్వీసు పూర్తవబోతున్న ఏ ఇద్దరు, ముగ్గురు ఉద్యోగులు కలిసినా ఇదే చర్చ జరుగుతోంది. చేసిన అప్పులు ఓ వైపు.. వాటికి పెరిగిపోతున్న వడ్డీలు మరో వైపు తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నాయి. ప్రభుత్వం వ్యవహార శైలి చూస్తే ఇబ్బందికరంగా ఉందని, ఇలాంటి పరిస్థితి కొనసాగితే వృద్ధాప్యంలో ఎలా బతకాలి? అంటూ ప్రశ్నిస్తున్నారు. ప్రయోజనాల కోసం అందని పలువురు పెన్షనర్లు సంఘాల నేతలను ఆశ్రయిస్తున్నారు. ప్రయోజనాలు త్వరగా వచ్చేలా చూడాలని కోరుతున్నారు. ఈ పరిణామాలతో పదవీ విరమణ పొందడానికి సిద్ధంగా ఉన్న ఉద్యోగుల్లోనూ ఆందోళన నెలకొంటున్నది.

ఫీజులు చెల్లించకపోతే ప్రైవేట్ కళాశాలలను బంద్ చేస్తాం

రిజిస్ట్రార్, కలెక్టర్‌కు ప్రైవేట్ యాజమాన్యాల నోటీసులు



రిజిస్ట్రార్‌కు నోటీస్ ఇస్తున్న ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాల బాధ్యులు

కేయూ క్యాంపస్, అక్టోబరు 7 : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు నిరవధిక బంద్ పాటిస్తూ పోరు బాటకు సిద్ధమైయ్యారు. ఈ మేరకు సోమవారం పలు డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని వర్సిటీ రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి, హనుమకొండ, వరంగల్ జిల్లా కలెక్టర్లు ప్రావీణ్యకు, సత్య శారదలకు వేర్వేరుగా అందచేశారు. ఈ సందర్భంగా ప్రైవేట్ కళాశాల యాజమాన్యాల నేతలు మాట్లాడుతూ.. గత 3ఏళ్ళ నుంచి విద్యార్థులకు రావాల్సిన ఫీజు రీ యింబర్స్‌మెంట్ ఉపకార వేతాలను విడుదల చేయకపోవడంతో కళాశాల అధ్యా పకుల వేతనాలు, కళాశాల నిర్వహణ, అద్దెల చెల్లింపులకు ఇబ్బందిగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే విషయంలో గతంలో సీఎం రేవంత్‌రెడ్డికి, జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలతో పాటు ఇతర ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు. అయినా ప్రైవేట్ కళాశాల పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు ఉపకార వేతనాల విడుదలపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదని ధ్వజమెత్తారు. తమ ఫీజులు విడుదల చేయకపోవడాన్ని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1200 ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలను దసరా పర్వదినం తర్వాత మూకుమ్మడిగా మూసి వేసి నిరసన చేపట్టనున్నట్లు టీపీడీఎంఏ (తెలంగాణ ప్రైవేటు డిగ్రీ మేనేజ్‌మెంట్ అసోసియేషన్) సంఘం నేతలు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కేయూ పీఎంఏ (ప్రైవేట్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్) బాధ్యులు వేణుమాధవ్, గోలి వెంకట్, టీపీడీఎంఏ సభ్యులు జే.శ్రీధర్‌రావు, రవీందర్, విద్యాసాగర్, కృష్ణమోహన్, సదానందంతో పాటు అన్ని కళాశాల యాజమాన్యాల బాధ్యులు పాల్గొన్నారు.

అట్టహాసంగా రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ప్రారంభం


పోటీలను ప్రారంభించిన స్పోర్ట్స్ ఓఎస్‌డీ రవీందర్ రెడ్డి

కొత్తక్రీడా పాలసీ తెచ్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని వెల్లడి



స్పోర్ట్స్ ఓఎస్‌డీ రవీందర్ రెడ్డి సన్మానిస్తున్న అథ్లెటిక్స్ అసొసియేషన్ సభ్యులు

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు 7 : హనుమకొండ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ సింథటిక్ ట్రాక్‌లో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ సోమవారం అట్టహాసంగా ప్రారంభమైంది. సీఎం పేషి స్పోర్ట్స్ ఓఎస్‌డీ రవీందర్‌రెడ్డి ఈ పోటీలను ప్రారంభించారు. తొలుత క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడారు. అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణకు గుర్తింపు తెచ్చేలా కొత్త స్పోర్ట్స్ పాలసీ తెచ్చేందుకు సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని వెల్లడించారు. వివిధ క్రీడల్లో ప్రతిభ ఉన్న గ్రామీణస్థాయి యువతను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడేలా తీర్చిదిద్దాలన్నది సీఎం సంకల్పమని స్పష్టం చేశారు. లక్ష్యానికి అనుగుణంగా అత్యుత్తమ విధానాలను క్రీడాపాలసీలో పొందుపరిచేలా చర్యలు చేపట్టేలా సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశాలు ఇప్పటికే నిర్వహించామన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే క్రీడాకారులకు ఇచ్చే ప్రోత్సాహకాలను అధ్యయనం చేసి రాష్ట్రంలో అనుసరించాల్సిన విధానాన్ని స్పోర్ట్స్ పాలసీలో పొందుపరించేందుకు సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే సలహాలు, సూచనలు చేయడం జరిగిందన్నారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కె.సారంగపాణి మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్న జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో 33 జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. అండర్-14, 16, 18, 20 బాలబాలికల వివిధ విభాగాలలో పోటీలను నిర్వహించడం జరిగిందన్నారు. ఇక్కడ రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అథ్లెట్‌లను ఈ నెల 25 నుంచి 29వ తేదీ వరకు ఒడిస్సా రాష్ట్రంలోని భువనేశ్వర్ రాష్ట్రంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. అనంతరం గత నెల సెప్టెంబర్‌లో చెన్నయ్‌లో నిర్వహించిన సౌత్ ఏషియన్ అథ్లెటిక్స్ ఫెడరేషన్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొని 800 మీటర్ల పరుగు పందెంలో రజత పతకం సాధించిన బి. వినోద్‌కుమార్‌ను, 3వేల పరుగు పందెంలో ప్రతిభ కనబర్చి రజత పతకం సాధించిన మరో క్రీడాకారుడు మోహిత్‌చౌదరిని అథ్లెటిక్స్ అసోసిమేషన్ పక్షాన ఒక్కొ క్రీడాకారుణికి రూ. 15వేల చొప్పున అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా డీవైఎస్‌వో జి. అశోక్‌కుమార్, అథ్లెటిక్స్ అసోసియేషన్ చైర్మన్ ఎర్రబెల్లి వరద రాజేశ్వర్‌రావు, సభ్యులు పగడాల వెంకటేశ్వర్లు, మురళీధర్, వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, టెక్నికల్ అఫీషియల్స్, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.



100మీటర్ల పరుగు పందెంలో పోటీ పడుతున్న క్రీడాకారులు

ఉత్సాహంగా తొలిరోజు పోటీలు

తొలిరోజు పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీల్లో క్రీడాకారులు చిరుతల్లా పరుగులీస్తూ నువ్వా నేనా అన్నట్లుగా తలపడ్డారు. ఏబీసీ ట్రైయాత్లిన్, 60, 600 మీటర్ల పరుగు పందెం, లాంగ్‌జంప్, షాట్‌పుట్, జావెలిన్ త్రో, డిస్కస్ త్రో హ్యామర్ త్రో పోటీల్లో సుమారు 1000 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

అండర్-16 బాలుర జావెలిన్ విభాగంలో..

ఎస్. శ్రీకాంత్ (మెదక్) ప్రథమ స్థానం, ఆర్. వంశీ (అసిఫాబాద్) ద్వితీయ స్థానం, పి. సతీష్‌కుమార్ (అదిలాబాద్) తృతీయ స్థానంలో నిలిచారు.

అండర్-16 బాలుర లాంగ్ జంప్ విభాగంలో....

జి. రాజేష్ (రంగారెడ్డి) ప్రథమ స్థానం, కె. ఉదయ్‌కిరణ్ (రంగారెడ్డి) ద్వితీయ స్థానం, కె. ఆనంద్ (కామారెడ్డి) తృతీయస్థానం.

అండర్ -18 బాలికల షాట్‌పుట్ విభాగంలో ..

కె. రాజరాజేశ్వరి (నాగర్ కర్నూల్) ప్రథమ స్థానం, జి. శ్రీరెడ్డి (రంగారెడ్డి) ద్వితీయస్థానం, ఎం.అక్షయ సిందూ (నల్గొండ) తృతీయ స్థానం .

అండర్ -18 బాలికల 1000 మీటర్లు పరుగుపందెం..

ఎ. అఖిల (నల్గొండ) ప్రథమస్థానం, కె. స్వప్న (నాగర్ కర్నూల్) ద్వితీయస్థానం, గౌనిప్రియా (రంగారెడ్డి) తృతీయస్థానం,

అండర్ -18 బాలుర డిస్కర్స్ త్రో ..

జి. సునిత్‌కుమార్ (జనగాం) ప్రథమ స్థానం, పి. గౌతం (కామారెడ్డి) ద్వితీయ స్థానం, జి. వరుణ్‌గౌడ్ (నిర్మల్) ద్వితీయ స్థానం.

అండర్ -18 బాలుర హై జంప్‌లో..

జి. సిద్ది వినయ్ (భద్రాద్రి కొత్తగూడెం) ప్రథమ, పి. వెంకటేశ్వర్‌రావు (భద్రాద్రి కొత్తగూడెం) ద్వితీయ స్థానం, బి.విష్ణు (మంచిర్యాల) తృతీయ స్థానం .

అండర్ -18 బాలుర 5000 మీటర్ల రేస్ వార్‌లో ..

ఎండ్ల సాయిచరణ్‌రెడ్డి (నిజామాబాద్)ప్రథమ స్థానం, ఎ. జశ్వంత్ (ఆదిలాబాద్)ద్వితీయస్థానం, చంద్ర సిద్ధార్థ (ఆదిలాబాద్) తృతీయస్థానం.

అండర్ -20 బాలుర 800 మీటర్ల పరుగు పందెంలో..

ఎం. ఈశ్వర్ (కామారెడ్డి) ప్రథమ స్థానం, గోపీచంద్ (ఖమ్మం) ద్వితీయ స్థానం, ఎం. అకిల్ (భద్రాద్రి కొత్తగూడెం) తృతీయ స్థానం.

అండర్ -20 బాలుర షాట్‌పుట్‌లో..

ఎ. సాయికిరణ్ (టీఏఏ వికారాబాద్) , ప్రథమ స్థానం, వైదిత్‌రెడ్డి (హైదరాబాద్) ద్వితీయ స్థానం, ఎస్‌కే అల్తాఫ్ (ఖమ్మం) తృతీయ స్థానం.

అండర్ -20 బాలుర డిస్‌కర్స్ త్రోలో..

ఎస్. విదిత్‌రెడ్డి (హైదరాబాద్) ప్రథమ, కె.స్వామి (కరీంనగర్) ద్వితీయ, రాహుల్ (హైదరాబాద్) తృతీయ స్థానంలో నిలిచారు.

కాజీపేట మీదుగా బీదర్-నాగ్‌పూర్ స్పెషల్ రైలు

కాజీపేట, అక్టోబరు 7 : దసరా, దీపావళి పండగల రద్దీ దృష్ట్యా కాజీపేట మీదుగా నాగ్‌పూర్ వైపు స్పెషల్ రైలు నడపడానికి రైల్వే అధికారులు అన్ని చర్యలు చేపట్టారు. (07023) బీదర్-నాగ్‌పూర్ మధ్య నడిచే ఈ స్పెషల్ రైలు బీదర్‌లో ఈ నెల 11న, 18. 45 నిమిషాలకు బయలు దేరి తరువాత రోజు నాగ్‌పూర్‌కు 12. 00 చేరుకుంటుంది. (07024) నాగ్‌పూర్ - బీదర్ స్పెషల్ నాగ్‌పూర్‌లో ఈ నెల 13న 20. 10నిమిషాలకు బయలు దేరి తరువాతి రోజు 11.00 బీదర్‌కు చేరుకుంటుంది. ఈ రైలు నిజామాబాద్, మర్పెల్లి, వికారాబాద్, లింగంపల్లి, సికింద్రాబాద్, కాజీపేట, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్ కాగజ్‌నగర్, బల్లార్షా, చంద్రాపూర్ రైల్వే స్టేషన్‌లలో హాల్టింగ్ సౌకర్యం కల్పించారు.

సినీ గేయ రచయిత కందికొండ విగ్రహావిష్కరణ



కందికొండ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నర్సంపేట టౌన్, అక్టోబరు 7 : నర్సంపేట మండలం నాగుర్లపల్లి గ్రామానికి చెందిన సినీ గేయ రచయిత కందికొండ యాదగిరి విగ్రహాన్ని సోమవారం ఎమ్మెల్యే దొంతి మాదవరెడ్డి ఆవిష్కరించారు. గ్రామానికి చెందిన కందికొండ సాంబయ్య-కొంరమ్మ దంపతులకు 1973, అక్టోబరు 13న యాదగిరి జన్మించారు. తన ఇంటి పేరునే కలం పేరుగా మార్చుకొని 1300 కు పైగా సినీ, ప్రైవేట్ ఆల్బమ్స్, జానపద గేయాలు రచించారు. క్యాన్సర్ వ్యాధితో 2022, మార్చి 12న హైదరాబాద్‌లో కందికొండ మృతి చెందాడు. నాగుర్లపల్లె గ్రామంలోని యాదగిరి కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన ఆయన విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పాము, కప్ప.. బతుకు పోరాటం!

ఈ చిత్రాలు చూశారా.. ఓ నీటి పాము ఓ కప్పను మింగేందుకు ప్రయత్నించింది. కానీ తనను తాను కాపాడుకునేందుకు ఆ కప్ప తీవ్రంగా ప్రతిఘటించింది. అదే సమయంలో నోటికాడికొచ్చిన ఆహారాన్ని వదులుకోకూడదన్నట్టుగా ఆ పాము కప్పను నోటితో పట్టుకుంది. ఇలా ఆ పాము, కప్ప మధ్య జరిగిన 'బతుకు పోరాటం'లో చివరకు ఆ కప్ప పాము చెర నుంచి బయటపడి అక్కడి నుంచి జారుకుంది. ఆ పాము కూడా ఉసూరుమంటూ అక్కడి నుంచి వెనుదిరిగింది. వరంగల్ జిల్లా గీసుగొండ కంఠమహేశ్వర స్వామి దేవాలయం సమీపంలో సోమవారం ఈ దృశ్యాలు కనిపించాయి.

ఫొటోలు : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటో గ్రాఫర్, హనుమకొండ





కప్పను నోటకరుచుకున్న పాము, తప్పించుకు పోతున్న కప్ప



ఆంధ్రజ్యోతి WARANGAL CITY 8

వరంగల్ సిటీ

• వరంగల్ • ఖిలావరంగల్

మంగళవారం 8 అక్టోబరు 2024

హనుమకొండలో నేటి నుంచి చేనేత వస్త్ర ప్రదర్శన

ఆటోనగర్, అక్టోబరు 7: డెవలప్‌మెంట్ కమిషనర్ ఫర్ హ్యాండ్లూమ్స్ మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ న్యూఢిల్లీ, కమిషనర్ చేనేత, జౌళీ శాఖ, అప్పారెల్ ఎక్స్‌పోర్ట్స్ హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం సమన్వయంతో సహాయ సంచాలకులు చేనేత జౌళీ శాఖ వరంగల్ వారి ఆధ్వర్యంలో రాష్ట్ర చేనేత వస్త్ర ప్రదర్శన-2024 మంగళవారం ప్రారంభించనున్నట్లు చేనేత, జౌళీ శాఖ ఏడీ రాఘవరావు ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ ఎన్‌జీవోస్ కాలనీలోని రెడ్డి మ్యారేజ్ ఫంక్షన్ హాల్‌లో ఈనెల 8 నుంచి 21 వరకు ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్, వెస్ట్‌బెంగాల్, కాశ్మీర్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి 60ప్రాథమిక చేనేత సహకార సంఘాలు పాల్గొంటాయని వెల్లడించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చేనేత జౌళా శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.



బాలసముద్రం ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

పనులు త్వరగా పూర్తి చేయండి

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 7: హనుమకొండ బాలసముద్రం, వరంగల్ పోతననగర్‌లో నిర్మాణమైన చెత్త ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లో మిగిలిన సివిల్ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సూచించారు. సోమవారం బల్దియా పరిధిలోని రెండు చెత్త ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ల పనులను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. స్వచ్ఛ ఆటోలు సేకరించి తెచ్చిన చెత్త ఇక్కడి నుంచి రాంపూర్‌కు ఎంత సమయంలో తరలిస్తున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. బాలసముద్రం సెకండ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ అంతర్గత రోడ్లను వెంటనే పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, డీఈ సారంగం, ఏఈ సురేష్‌బాబు, శానిటరి ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఇంతెజార్‌గంజ్ సీఐగా షుకూర్

వరంగల్ చౌరస్తా, అక్టోబరు 7: వరంగల్ ఇంతెజార్‌గంజ్ పోలీసు స్టేషన్ సీఐగా ఎంఏ షుకూర్‌ను నియమిస్తూ సీపీ అంబర్‌కిశోర్ ఝా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సీఐగా విధులు నిర్వహిస్తున్న మచ్చ శివకుమార్ సీసీఎస్‌కు బదిలీ అయ్యారు. ఇంతెజార్‌గంజ్ పోలీసు స్టేషన్ సీఐగా బాధ్యతలు చేపట్టి ఆరు నెలలు మాత్రమే అయింది. రాజకీయ ఒత్తిళ్ల నేపథ్యంలో బదిలీ జరిగినట్లు ఊహగానాలు వినిపిస్తున్నాయి. బదిలీ అయిన వారిలో జి.సీతారెడ్డి ఎస్‌బీ నుంచి హనుమకొండ ట్రాఫిక్, షుకూర్ హనుమకొండ ట్రాఫిక్ నుంచి ఇంతెజార్‌గంజ్, జె.వెంకటరమణ కమిషనరేట్ నుంచి మిల్స్‌కాలనీకి బదిలీ అయ్యారు.

కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

వరంగల్ కలెక్టరేట్, అక్టోబరు 7: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించడంతోపాటు పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట కార్మికులు ధర్నా చేపట్టారు. కార్మికుల రాష్ట్ర కార్యదర్శి చాగంటి వెంకటయ్య, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ లెక్కల ప్రకారం 52వేల మంది పని చేస్తున్నారని తెలిపారు. గ్రామ పంచాయతీ కార్మికులకు సంవత్సరాల తరబడి విధులు నిర్వహిస్తున్నా నేటికి పని భద్రత కల్పించకపోగా శ్రమకు తగ్గ వేతనం ఇవ్వడం లేదన్నారు. అతి తక్కువ వేతనంతో పని చేస్తున్నప్పటికీ నెల నెలా వేతనాలు ఇవ్వకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. దసరా పండగ పూట కార్మికులు పస్తులుండాల్సిన దుస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ నాయకులు అశోక్, రాజేందర్, ఉస్మాన్, రమేశ్, సాయిలు, ఉపేంద్ర, యాకమ్మ, రాజు పాల్గొన్నారు.

పొట్టేళ్ల చోరీ

గీసుగొండ, అక్టోబరు 7: చంద్రయపల్లి గ్రామానికి చెందిన బోగిని రాజు, అశోక్, పల్లికొండ నర్సయ్య, ఎర్రంశెట్టి యాకయ్యలకు చెందిన రెండు గొర్రెలు, రెండు పొట్టేళ్లను గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి అపహరించుకు పోయినట్లు బాధితులు తెలిపారు. అర్ధరాత్రి గ్రామంలోని గొర్రెల మందలలో నుంచి రూ. లక్ష విలువ చేసే గొర్రెలను అపహరించుకుపోయినట్లు వారు చెప్పారు. గుర్తు తెలియని వ్యక్తులు వాహనంలో వచ్చి ఎత్తుకెళ్లినట్లు అనుమానిస్తున్నారు. ఈమేరకు గీసుగొండ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

ఘనంగా దేవీ శరన్నవరాత్రి వేడుకలు



రంగశాయిపేటలో శాకంబరిగా అమ్మవారు

శంభునిపేట, అక్టోబ రు 5 : శరన్నవాత్రి ఉత్సవాలలో భాగంగా సోమవా రం ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. రంగశాయిపేటలోని రామాలయం లో శ్రీరామ భజన మండలి మహిళా విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహాఅన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జెం డా వద్ద శివపుత్ర యూత్ ఆధ్వర్యంలో అమ్మవారు శాకంబరిగా దర్శనమిచ్చా రు. గాంధీ విగ్రహం వద్ద వీరాంజనేయ యూత్ ఆధ్వర్యంలో, హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

» పోచమ్మమైదాన్: పైడిపెల్లిలో శ్రీ జగన్మాత సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి మాజీ జిల్లా కోఆర్డినేటర్ ఎల్లావుల లలితాయాదవ్, ఎల్లావుల కుమార్‌యాదవ్, వరంగల్ పీఏసీఎస్ చైర్మన్ ఇట్యాల హరికృష్ణ, డైరెక్టర్ లింగం కోటిలింగం పాల్గొన్నారు.

» ఖిలావరంగల్ : శివనగర్‌లోని భూపేష్‌నగర్‌లో కృష్ణకుమారి ఏర్పాటు చేసిన అమ్మవారిని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షు రాలు ఎర్రబెల్లి స్వర్ణలు దర్శించుకున్నారు. అర్చకుడు సారయ్య, స్వర్ణ పేరున పూజలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కరాటే ప్రభాకర్, ఉమ, సంతోషి, స్వరూప, అరుణ, అజీరా, వెంకట్, నూనే శంకర్, మధు పాల్గొన్నారు.



శివనగర్‌లో ఎమ్మెల్సీ సారయ్య, జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ



పైడిపల్లిలో ఆకట్టుకున్న శోభాయాత్ర

పోచమ్మమైదాన్: పైడిపెల్లిలో శ్రీభద్రకాళి యూత్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం అమ్మవారిశోభాయాత్ర నిర్వహించారు. వైవిధ్యమైన విగ్రహాలు ఏర్పాటు చేశారు. కార్పొరేటర్ జన్ను షిబారాణిఅనిల్, కాంగ్రెస్ నాయకుడు జన్ను అనిల్‌కుమార్ ముఖ్యఅతిథులుగా హాజరై శోభాయాత్రను ప్రారంభించారు. శివుడు, హనుమాన్, కాళికామాత రూపాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు జన్ను శంకర్, ఉప్పుల రవి, కన్నెబోయిన నాగరాజు యాదవ్, కలిమి శ్రీకాంత్, బత్తిని భరత్, కంది అఖిల్, కొత్తకొండ కిట్టు, బైరోని వరుణ్, బోయిని రాజేష్, బొల్లం రాకేష్, కరుణాకర్, వరుణ్ పాల్గొన్నారు.

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులకు నిరసనగా ధర్నా



వరంగల్ హెడ్‌పోస్టాఫీసు సెంటర్‌లో ధర్నాచేస్తున్న వామపక్షాలు

గిర్మాజీపేట, అక్టోబరు 7 : పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను నిరసిస్తూ సోమవారం వామపక్షాలు ధర్నా చేశాయి. సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, ఎంసీపీఐ(యు), సీపీఐ(ఎంఎల్) లిబరేషన్, ఎస్‌యుసీఐ, ఆర్ఎస్‌పీ, ఫార్వర్డ్ బ్లాక్ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు వరంగల్ హెడ్ పోస్టాఫీసు సెంటర్‌లో ధర్నా చేశాయి. వారు మాట్లాడుతూ పాలస్తీనాపై ఇజ్రాయిలు చేస్తున్న దాడులు అక్టోబరు7తో సంవత్సరం పూర్తి అయిందని, ఈ కాలంలో పాలస్తీనా ప్రజలు వేలాదిగా మరణించారని ఆరోపించారు. అమెరికా సామ్రాజ్యావాద విధానాల్లో భాగంగానే అమెరికా మద్దతుతోనే ఇజ్రాయిలు పాలస్తీనాపై దాడులు చేస్తోందని పేర్కొన్నారు. ఐక్య ప్రజాఉద్యమాల ద్వారా ఇజ్రాయిల్ దాడులను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. అమెరికా, ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు రాచర్ల బాలరాజు అధ్యక్షతన జరిగిన నిరసనలో సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్.రంగయ్య, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి అకినపెల్లి యాదగిరి, ఆర్ఎస్‌పీ జిల్లా కార్యదర్శి వల్లందాసు కుమార్, ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి నవీద్ హకీం, ఎంసీపీఐ(యు) రాష్ట్ర నాయకులు గోనే కుమారస్వామి, సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు బండి కోటేశ్వరరావు, ఎస్‌యూసీఐ రాష్ట్ర నాయకులు గంగాధర్, వామపక్షాల నాయకులు నర్రా ప్రతాప్, గన్నారపు రమేష్, ఎలకంటి రాజేందర్, జగదీష్, ఎండి బషీర్, సత్యనారాయణ, కుమార్, పనాస ప్రసాద్, ఏలేందర్, దుర్గయ్య, సుస్మిత, హరిబాబు, ఎస్‌కే పాషా, రవి పాల్గొన్నారు.



ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

వరంగల్ కలెక్టరేట్, అక్టోబరు 7: నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని అఖిల భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (ఏఐఎఫ్‌డీవై) రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంద రవి డిమాండ్ చేశారు. ఏఐఎఫ్‌డీవై రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం కలెక్టరేట్ ఏవో శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ పది సంవత్సరాల కాలంలో నిరుద్యోగులకు మొండి చేయి చూపిందన్నారు. అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ జాబ్ క్యాలెండర్‌ను ఎనమిది నెలలు గడుస్తున్నా ప్రకటించలేదన్నారు. గత ప్రభుత్వం మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం గారడి మాటలతో కాలయాపన చేస్తోందని, ఇప్పటికైనా ఉద్యోగాల భర్తీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జక్కా అశోక్, ఎర్ర రాజు, కుడుము రంజిత్, జెట్టి రాజు పాల్గొన్నారు.



నిర్మలకు వినతిపత్రం అందజేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

మార్కెట్లోనే క్రయవిక్రయాలు జరగాలి

వరంగల్ వ్యవసాయం, అక్టోబరు 7: వరంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ బైలా ప్రకారం మార్కెట్లోనే క్రయవిక్రయాలు జరగాలని మార్కెట్ కార్యదర్శి పోలెపాక నిర్మలకు కార్మిక సంఘాల సమాఖ్య ప్రతినిధులు సోమవారం వినతిపత్రం అందజేశారు. మార్కెట్‌నే నమ్ముకుని సుమారు ఐదు వేల మంది కార్మికులు పనిచేస్తున్నారన్నారు. ఇటీవల పంట ఉత్పత్తులను నేరుగా మిల్లులు, గోదాముల వద్ద క్రయవిక్రయాలు జరగడంతో మార్కెట్లో పనిచేసే కార్మికులకు పనిలేకుండా పోతోందని వాపోయారు. బైలాను అనుసరించి మార్కెట్‌లోనే క్రయవిక్రయాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మార్కెట్‌కు ఏటా రూ.50 కోట్ల ఆదాయం ఉన్నా..మార్కెట్లో మాత్రం పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు లేవని, తాగునీరు, టిఫిన్, భోజనశాల, క్లీనింగ్, రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు, ఏదైనా ప్రమాదం జరిగితే బాధిత కుటుంబాలకు వర్తించే ఇన్సూరెన్స్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తదితర సమస్యలను పరిష్కరించకపోవడం ఇబ్బందిగా మారిందని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘల నాయకులు ఇనుముల మల్లేశం, సులుగం వేణుగోపాల్, ఈటెల దేవేందర్, సోల రవి, రాజబోయిన యాకయ్య, కట్కూరి సుధాకర్, గొర్రె శేఖర్ పాల్గొన్నారు.

‘జీవనజ్యోతి’ని సద్వినియోగం చేసుకోవాలి

గీసుగొండ, అక్టోబరు 7: కేంద్ర చేపట్టిన ప్రధానమంత్రి జీవనజ్యోతి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని యూబీఐ మేనేజర్ సర్వేశం సూచించారు. కొమ్మాలలో ‘కేంద్ర పథకాలు -ప్రజల సద్వినియోగం’ పై గ్రామస్థులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవనజ్యోతి పథకంలో 19 నుంచి50 వయస్సు గల వారు సంవత్సరానికి రూ.436 చెల్లిస్తే రూ. 2లక్షల బీమా లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఫైనాన్స్ లిటరసీ కౌన్సిలర్ భాస్కర్, రవీందర్, బ్రహ్మచారి, శ్రీకాంత్, మౌనిక పాల్గొన్నారు.

మార్కెట్‌కు పండగ సెలవులు

వరంగల్ వ్యవసాయం, అక్టోబరు 7: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు సద్దుల, దసరా పండగను పురస్కరించుకుని నాలుగురోజుల పాటు సెలవులు ప్రకటించినట్లు ఆ మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం దుర్గాష్టమి, శుక్రవారం మహర్నవమి, శనివారం విజయదశమి, ఆదివారం సాధారణ సెలవు, విజయదశమి మరుసటి రోజును పురస్కరించుకుని వరుసగా సెలవులను ప్రకటించినట్లు తెలిపారు. రైతులు, వ్యాపారులు, కార్మికులు మార్కెట్ కమిటీకి సహకరించాలని కార్యదర్శి కోరారు.

ప్రజలకు చిల్లర కష్టాలు

» రూ.10, రూ.20కు తీవ్ర ఇబ్బందులు

» చెలామణిలోకి రూ.10 నాణాలు



వర్ధన్నపేట రూరల్, అక్టోబరు 7 : రూ.10, రూ.20 నోట్లు దొరకక సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్‌లో కూరగాయాల నుంచి కిరాణ షాపుల్లో, టీ స్టాల్స్, పాన్ షాపుల వద్ద చిల్లర కోసం క్రయవిక్రయదారులు తీవ్ర ఇబ్బందులు పడు తున్నారు. మార్కెట్‌లో రూ.10, రూ.20, రూ.50 నోట్లు లభ్యం కాకపోవడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. డిజిటల్ లావాదేవీలు సైతం పెరిగిపోవడంతో ప్రస్తుతం ఈ సమస్య ఉత్పన్నమైనట్లు చర్చించుకుంటున్నారు. గ్రామీణ ప్రాంత కొన్ని దుకాణాల్లో ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం వంటి ఆన్‌లైన్ పేమెంట్ చెల్లింపులు లేకపోవడంతో షాపుల్లో ఎవరికైనా సరుకు లు తీసుకున్నాక డబ్బులు చెల్లించడంలో చిల్లర సమస్య తరుచూ ఎదురవుతోంది. ఆన్‌లైన్ చెల్లింపులు లేవా అంటూ వాగ్వాదానికి దిగుతున్నారు.

పెద్ద నోట్లకే మక్కువ...

బ్యాంకుల నుండి డబ్బులు డ్రా చేసుకునే వారు ఎక్కువగా పెద్ద నోట్లపైనే మక్కువ చూపుతున్నారు. ప్రస్తుతం రూ.2వేల నోటు లేకపోవడంతో ప్రతీ ఒక్కరు రూ.500 నోట్ల నే తీసుకెళ్తున్నారు. కొంతమంది తప్పక రూ.200 లేదా రూ.100నోటు తీసుకుంటున్నారు. కానీ మరీ చిన్ననోట్లను తీసుకోవడానికి సుముఖత చూప డం లేదు. చిన్న నోట్లు చిరిగినా అవి చెల్లవంటూ చెప్పడంతో వాటిని ఎక్కువగా వాడటం లేదు.

రూ. 10 నాణాలు మార్కెట్‌లోకి

ప్రభుత్వం గతంలో రూ.10 నాణాలను ప్రవేశపెట్టింది. కొన్ని రోజులు బాగానే చెలామణి అయినా, క్రమంగా వాటి ప్రాధాన్యం తగ్గిపోవడంతో పాటు అవి చెల్లవన్న పుకారుతో పక్కన పెట్టే శా రు. కొన్ని చోట్ల బ్యాంకు అధికారులు సైతం తిరస్కరించడంతో నాణాలు మనుగడలో లేకుండా పోయాయి. ఈ మధ్య కాలంలో తిరిగి మళ్లీ రూ.10 నాణాలు వెలుగులోకి వచ్చాయి. చిల్లర కష్టా లు ఉండడంతో పది రూపాయాల నోట్లు లభించకపోవడంతో కొన్ని చోట్ల దుకాణాదారులు రూ.10 నాణాన్ని అందిస్తున్నారు. వీటిని సైతం క్రయవిక్రయాల చోట వాడుతున్నారు.

పండుగ ముచ్చట్లు

నేడు బల్దియాలో బతుకమ్మ సంబరాలు

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 7: బల్దియా పరిధిలో పని చేస్తున్న మహిళా ఉద్యోగులు మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో జరిగే బతుకమ్మ వేడుకలకు హాజరుకావాలని గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం జరిగే బతుకమ్మ వేడుకలకు మహిళా ఉద్యోగులు హాజ రై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కమిషనర్ తెలిపారు.

బతుకమ్మ పాటల పోటీలు

శంభునిపేట, అక్టోబరు7 : బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి అని కాకతీయ సేవా సమితి అధ్యక్షుడు మండల నరసింహారాములు అన్నారు. రంగశాయిపేటలో కాకతీయ సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం బతుకమ్మ పాటల పోటీలు నిర్వహించారు. జనతా పరపతి సంఘ ఆవరణలో నిర్వహించిన పోటీలను కార్పొరేటర్ గుండు చందనపూర్ణచందర్, సంఘం అధ్యక్షులు కేడల మల్లేశం ప్రారంభించారు. మహిళల్లో సృజనాత్మకతను వెలికి తీయటానికి సేవా సమితి ఆధ్వర్యంలో 29ఏళ్ల నుంచి పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జక్కం దామోదర్, ఎలుగు రవికుమార్, బొలిశెట్టి కమలాకర్, చిగిరి కుమారస్వామి, కేడల కరుణ, పోశాల మాధవి, పోశాల మల్లికార్జున్, అనుమాండ్ల రమేష్, సమితి బాధ్యులు రాజు, వేణు, వినయ్ కుమార్, పెద్దరాజు, రాజశేఖర్ పాల్గొన్నారు.



పోటీల్లో పాల్గొన్న టీము సభ్యులతో నిర్వాహకులు

ముస్తాబవుతున్న ఉత్సవ ప్రాంతాలు

ఖిలావరంగల్, అక్టోబరు 7: సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలకు ఖిలావరంగల్‌లోని మైదానాలను ముస్తాబు చేస్తున్నారు. 10న సద్దుల బతుకమ్మ, 12న దసరా కోసం బల్దియా చెరువుల్లోని గుర్రపుడెక్క, ఆట మైదానాలను శుభ్రం చేయిస్తోంది. మెట్టుకోట, తూర్పుకోటలతోపాటు శివనగర్ బతుకమ్మ ఆట మైదానం, అలాగే 18వ, డివిజన్ కట్టమల్లన్న దేవాలయం వద్ద కట్టమల్లన్న చెరువులో పెరిగిన గుర్రపు డెక్కను తొలగిస్తున్నారు. అలాగే ఆయా ప్రాంత మైదానాల్లో పెరిగిన ముళ్లపొదలు, చెట్లు, చెదారాన్ని తొలగిస్తున్నారు. బతుకమ్మతల్లి విగ్రహాలకు రంగులు వేస్తున్నారు. విద్యుత్ దీపాలు, మెర్క్యూరి లైట్లు, స్టేజీ, సీరియల్ బల్బ్స్, బారికేడ్లు, తాగునీటి వసతులను ఏర్పాటు చేశారు.



శివనగర్‌లో బతుకమ్మ తల్లి విగ్రహాలకు రంగులు



మెట్టుకోట చెరువులో గుర్రపు డెక్కను తొలగిస్తున్న బల్దియా సిబ్బంది

ఉత్సవాలకు ఆహ్వానం

కరీమాబాద్, అక్టోబరు 7: సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలకు హాజరు కావాలని స్వాగతం పలుకుతూ రంగలీలా మైదానం దసరా ఉత్సవ కమిటీ సభ్యులు ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యను కలిసి కోరారు. సోమవారం సారయ్య నివాసానికి వెళ్లి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా బస్వరాజు సారయ్య మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలను ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నాగపూరి సంజయ్‌బాబు, ప్రధాన కార్యదర్శి మేడిది మధుసూదన్, కోశాధికారి మండా వెంకన్నగౌడ్, సహాయ కోశాధికారి వెలిదే శివమూర్తి, ట్రస్ట్ చైర్మన్ వంగరి కోటేశ్వర్, ఉపాధ్యక్షులు గోనె రాంప్రసాద్, నాగపూరి రంజిత్ గౌడ్, వొగిలిశెట్టి అనిల్ కుమార్, పొగాకు సందీప్, వెంకటేశ్వర్లు, కార్యదర్శులు సంజీవ్, వాసు, అజయ్, అఖిల్‌గౌడ్, అశోక్, రాజు, మహేష్, శ్రీను, గోవర్ధన్ పాల్గొన్నారు.



సారయ్యను కలిసిన దసరా ఉత్సవ కమిటీ సభ్యులు



ఒకే గ్రామంలో ఇద్దరికి ఎంబీబీఎస్ సీట్లు


నవీన్


సుష్మస్వరాజ్

గీసుగొండ, అక్టోబరు 7: ఇటీవల విడుదల చేసిన నీట్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన మచ్చాపూర్ గ్రామానికి చెందిన బోడకుంట్ల నవీన్, నమిండ్ల సుష్మస్వరాజ్ ఎంబీబీఎస్ సీట్లు సాధించారు. నవీన్‌కు 3,331 ర్యాంక్ సాధిం చగా వికారాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో, 7,067 ర్యాంక్ సాధించిన సుష్మ స్వరాజ్‌కు నారాయణపేట్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీట్లు పొం దారు. వీరిని ప్రముఖ న్యూరో సర్జన్ బోడకుంట్ల ప్రభాకర్, మాజీ సర్పంచ్ ప్రకాష్, గ్రామస్థులు సోమవారం అభినందించారు.


పూలే విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు

జ్యోతిరావు పూలే విగ్రహావిష్కరణ

పర్వతగిరి, అక్టోబరు 7: మండలంలోని చింతనెక్కొండ గ్రామంలో గ్రామీణ హితకారిణి సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గటికె మల్లయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జ్యోతిరావుపూలే విగ్రహాన్ని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ మహనీయుడి విగ్రహాలను ఏర్పాటు చేసుకోవడమే గాకుండా ఆయన ను ఆదర్శంగా తీసుకుని ముందుకుసాగాలన్నారు.

అనంతరం గ్రామంలో ఇటీ వల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కానిస్టేబుల్ విజేందర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమం లో తహసీల్దార్ వెంకటస్వామి, గటికె అజయ్‌కుమార్, పిన్నింటి అనిల్‌రావు, గొర్రె దేవేందర్, పల్లెపాటి రాం చందర్‌రావు, చలపతిరావు, జాటోత్ శ్రీనివాస్ నాయక్, ఓరుగంటి శ్రీనివాస్, దబ్బెట నర్సింహులు, బోనాల సాంబయ్య, పం జాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి వేడుకల్లో ఎమ్మెల్యే

మండలంలోని ఏనుగల్లు గ్రామంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెయిన్‌బో యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాతకు ఎమ్మెల్యే నాగరాజు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పూజారి వెంకటాచార్యులు, యూత్ సభ్యులు పెరమాండ్ల శ్రీనివాస్, గుండా రాకేష్ ముదిరాజ్, కొత్తపెల్లి నాగరాజు, శ్యామకూరి అనిల్, మంద రాజు, గుండా రవి, అన్నం మహేష్, కానిగంటి సంతోష్, నల్లెల కోటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

విలీన సభను విజయవంతం చేయాలి



విలీన సభ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

నర్సంపేట, అక్టోబరు 7 : హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈనెల 20న జరిగే టీయూసీఐలో ఐఎఫ్‌టీయూ విలీన సభను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి అడ్డూరి రాజు పిలుపునిచ్చారు. పట్ట ణంలోని సంఘం కార్యాలయం ఆవరణలో సోమవారం విలీనసభ పోస్టర్లను ఆ విష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కుల కో సం బలమైన కార్మిక సంఘాన్ని ఏర్పాటు చేసుకోవడానికే టీయూసీఐలో ఐఎఫ్ టీయూ విలీనమవుతుందన్నారు. కార్యక్రమంలో రాజేందర్, ఎం వీరారెడ్డి, శ్యా మ్, శేఖర్, ఘైదం పాణి, శంకర్, విఠల్, మనోహర్‌చారి తదితరులు పాల్గొన్నారు.

చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలి

నర్సంపేట టౌన్, అక్టోబరు 7 : ఎస్సీ వర్గీకరణ అమలయ్యాకే టీచర్ పోస్టు లు భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 9న నిర్వహించనున్న చలో కలెక్టర్‌ను విజయవంతం చేయాలని ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చింతం సిద్ధు పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలోనే ఎస్సీ వర్గీకరణను ముందుగా తెలంగాణ రాష్ట్రంలోనే అమలు చేస్తామని అసెంబ్లీలో ప్రకటించిన సీఎం రేవం త్‌రెడ్డి 11,062 పోస్టుల భర్తీకి సిద్ధపడడం శోచనీయమన్నారు. చలో కలెక్టరేట్‌కు విద్యార్థులు, నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ సమావే శంలో శ్రీకాంత్, నవీన్, నితిన్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏనుమాముల మార్కెట్‌కు పండుగ సెలవులు

వరంగల్ వ్యవసాయం, అక్టోబరు 7: ఏనుమాముల వ్యవసాయ మార్కె ట్‌కు సద్దులు, దసరా పండుగను పురస్కరించుకుని నాలుగు రోజుల పాటు సెలవులు ప్రకటించినట్లు ఆ మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మ ల సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం దుర్గాష్టమి, శుక్ర వారం మహర్నవమి, శనివారం విజయదశమి, ఆదివారం సాధారణ సెలవు, విజయదశమి మరుసటి రోజును పురస్కరించుకుని వరుసగా సెలవులను ప్రకటించినట్లు తెలిపారు. రైతులు, వ్యాపారులు, కార్మికులు మార్కెట్ కమి టీకి సహకరించాలని కార్యదర్శి కోరారు.

ప్రజలకు చిల్లర కష్టాలు

▸ రూ. 10, రూ. 20 లకు తీవ్ర ఇబ్బందులు
▸ చెలామణిలోకి రూ.10 నాణాలు



వర్ధన్నపేట రూరల్, అక్టోబరు 7 : రూ.10, రూ.20 నోట్లు దొరకక సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మా ర్కెట్‌లో కూరగాయాల నుంచి కిరాణ షాపుల్లో, టీ స్టాల్స్, పాన్ షాపుల వద్ద చిల్లర కోసం క్రయవిక్రయదారు లు తీవ్ర ఇబ్బందులు పడు తున్నా రు. మార్కెట్‌లో రూ.10, రూ.20, రూ. 50 నోట్లు లభ్యం కాకపోవడమే ఇందు కు కారణమని తెలుస్తోంది. డిజిటల్ లా వాదేవీలు సైతం పెరిగిపోవడంతో ప్రస్తు తం ఈ సమస్య ఉత్పన్నమైనట్లు చర్చించుకుం టున్నారు. గ్రామీణ ప్రాంత కొన్ని దుకాణాల్లో ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం వంటి ఆన్‌లైన్ పేమెంట్ చెల్లింపులు లేకపో వడంతో షాపుల్లో ఎవరికైనా సరుకు లు తీసుకున్నాక డబ్బులు చెల్లించడంలో చిల్లర సమస్య తరుచూ ఎదురవుతోంది. ఆన్‌లైన్ చెల్లింపులు లేవా అంటూ వాగ్వాదానికి దిగుతున్నారు.

పెద్ద నోట్లకే మక్కువ...

బ్యాంకుల నుండి డబ్బులు డ్రా చేసుకునే వారు ఎక్కువగా పెద్ద నోట్లపైనే మక్కువ చూపుతున్నారు. ప్రస్తుతం రూ.2వేల నోటు లేకపోవడంతో ప్రతీ ఒక్కరు రూ.500 నోట్ల నే తీసుకెళ్తున్నారు. కొంతమంది తప్పక రూ.200 లేదా రూ.100నోటు తీసుకుంటున్నారు. కానీ మరీ చిన్ననోట్లను తీసుకోవడానికి సుముఖత చూప డం లేదు. చిన్న నోట్లు చిరిగినా అవి చెల్లవంటూ చెప్పడంతో వాటిని ఎక్కువగా వాడటం లేదు.

రూ. 10 నాణాలు వెలుగులోకి...

ప్రభుత్వం గతంలో రూ.10 నాణాలను ప్రవేశపెట్టింది. కొన్ని రోజులు బాగానే చెలామణి అయినా, క్రమంగా వాటి ప్రాధాన్యం తగ్గిపోవడంతో పాటు అవి చెల్లవన్న పుకారుతో పక్కన పెట్టే శా రు. కొన్ని చోట్ల బ్యాంకు అధికారులు సైతం తిరస్కరించడంతో నాణాలు మనుగడలో లేకుండా పోయాయి. ఈ మధ్య కాలంలో తిరిగి మళ్లీ రూ.10 నాణాలు వెలుగులోకి వచ్చాయి. చిల్లర కష్టా లు ఉండడంతో పది రూపాయాల నోట్లు లభించకపోవడంతో కొన్ని చోట్ల దుకాణాదారులు రూ.10 నాణాన్ని అందిస్తున్నారు. వీటిని సైతం క్రయవిక్రయాల చోట వాడుతున్నారు.

అన్ని పంటలకు బోనస్ చెల్లించాలి

సీఎంకు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి లేఖ


మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట, అక్టోబరు 7 : రైతుల అన్ని పంటలకు క్వింటాల్‌కు రూ. 500 చొప్పున ప్రభుత్వం బోనస్ చెల్లించాలని మాజీ ఎమ్మె ల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాసినట్లు ఆయన తెలిపారు. ఎన్నికల ముందు క్వింటాల్ ధాన్యానికి రూ. 2183 ధరకు రూ. 500 బోనస్ కలిపి ఇస్తామని హామీ ఇచ్చిన విషయం గుర్తు చేశారు. మద్దతు ధర సన్న రకాలకే ఇస్తామని దొడ్డు రకానికి ఇవ్వమంటూ మోస పూరిత ప్రకటన చేశారని ఆయన విమర్శించారు. అన్ని రకాల పంటలకు 500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోలులో కోతలు పెడుతూ ప్రభు త్వం 47 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేస్తుందన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద అమ్మితేనే బోన స్ ఇస్తామనడం సరి కాదన్నారు. రైతు లు ధాన్యం ఎక్కడ అమ్మినా బోనస్‌ను రైతుల ఖాతాలో జమ చేయాలని పెద్ది డిమాండ్ చేశారు. బోనస్ బోగస్ అని ఎద్దేవా చేశారు. ఇచ్చిన హామీ మేరకు అన్ని పంటలకు రూ. 500 వంతున రైతులకు బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు.

యువసేన యూత్ అధ్యక్షుడిగా రాజశేఖర్



చెన్నారావుపేట, అక్టోబరు 7: మండలం లోని ఖాదర్‌పేట గ్రామంలోని యువసేన యూత్ అధ్యక్షుడిగా కూస రాజశేఖర్ సో మవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపా ధ్యక్షులుగా నల్ల గణేష్, కార్యదర్శిగా కూస వెంకటేష్, కోశాధికారిగా పెంతల రంజిత్, సలహాదారులు గా ఎరుకల ప్రశాంత్, అరిగెల ప్రవీణ్, కార్యవర్గ సభ్యులుగా కూస రాజే ష్, సింగిరెడ్డి సురేష్, పెంతల ప్రవీణ్, కొనుగటి అఖిల్, వైనాల సందీప్, పెండ్లి శ్రవణ కృష్ణ, రఘువన్‌ను ఎన్నుకున్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

నగదు స్వాధీనం.. ఆరుగురిపై కేసు నమోదు

నర్సంపేట టౌన్, అక్టోబరు 7 : పట్టణంలోని ఒకరి ఇంట్లో పేకాట స్థావరంపై ఎస్సై రవికుమార్ ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం దాడులు చేశారు. పేకాడుతున్న ఆరుగురిపై పోలీసు లు కేసు నమోదు చేశారు. వారి నుంచి రూ.6,440 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వివరించారు. ఈ దాడిలో ట్రైనీ ఎస్సై దిలీప్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

యాదవ సంఘం కమిటీ ఎన్నిక


రాజు

ఖానాపురం, అక్టోబరు 7: మంగళవారిపే ట యాదవ సంఘం కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా భూషబోయిన రాజు, ఉపాధ్యక్షుడిగా భూష బోయిన సతీష్, ప్రధాన కార్యదర్శిగా బొల్లు మురళి, సహాయ కార్యదర్శిగా బొచ్చు రాజ న్న, కోశాధికారిగా కేతం రమేష్, సలహాదా రు లుగా పులిగిల్ల శ్రీశైలం, భూషబోయిన రవికుమార్, కార్యవర్గ సభ్యులుగా చెన్నబోయిన వీరన్న, భూషబోయిన శ్రీను, పోసాని వీరన్న, బొల్లు కుమార్, ఎద్దు చిన్నమల్లేష్‌ను ఎన్నుకున్నారు.

డివైడర్‌ను ఢీకొట్టిన లారీ

రాయపర్తి, అక్టోబరు 7 : మండలంలోని మైలారం గ్రామంలో సోమవారం లారీ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తొర్రూరు నుంచి వరంగల్ వెళ్తున్న సిమెంటు లోడు లారీ మైలారం బ్రిడ్జి వద్ద ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

'జీవనజ్యోతి'ని సద్వినియోగం చేసుకోవాలి

గీసుగొండ, అక్టోబరు 7: కేంద్ర చేపట్టిన ప్రధానమంత్రి జీవన జ్యోతి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని యూబీఐ మేనేజ ర్ సర్వేశం సూచించారు. కొమ్మాలలో కేంద్ర పథకాలు -ప్రజల సద్వినియోగం' పై గ్రామస్థులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవనజ్యోతి పథకంలో 19 నుంచి 50 వయస్సు గల వారు సంవత్సరానికి రూ.436 చెల్లిస్తే రూ. 2లక్షల బీమా లభిస్తుందన్నారు. కార్య క్రమంలో ఫైనాన్స్ లిటరసీ కౌన్సిలర్ భాస్కర్, రవీందర్, బ్రహ్మా చారి, శ్రీకాంత్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

పొట్టేళ్ల చోరీ

గీసుగొండ, అక్టోబరు 7: చంద్రయపల్లి గ్రామానికి చెందిన బోగిని రాజు, అశోక్, పల్లికొండ నర్సయ్య, ఎర్రంశెట్టి యాకయ్య లకు చెందిన రెండు గొర్రెలు, రెండు పొట్టేళ్లను గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి అపహరించుకుపోయినట్లు బాధి తులు తెలిపారు. అర్ధరాత్రి గ్రామంలోని గొర్రెల మందల నుం చి రూ. లక్ష విలువ చేసే గొర్రెలను అపహరించుకుపోయినట్లు వారు చెప్పారు. గుర్తు తెలియని వ్యక్తులు వాహనంలో వచ్చి ఎత్తుకెళ్లినట్లు అనుమానిస్తున్నారు. ఈమేరకు గీసుగొండ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

చెన్నారావుపేట, అక్టోబరు 7: చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందినట్లు ఎస్సై రాజేష్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మండలంలోని సూరిపల్లి గ్రామానికి చెందిన కాయిత సతీష్(40) ఈ నెల 5న తన ఇంటి ముందు ప్రమాద వశాత్తు జారి పడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు వరంగల్ లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. ఆరోగ్యం విషమించి సోమవారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి భార్య సరోజన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నట్లు ఎస్సై వివరించారు.

ఒకరికి తీవ్రగాయాలు

ఖానాపురం, అక్టోబరు 7: రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగా యాలైన ఘటన మండల కేంద్రంలో సోమవారం జరిగింది. బు ధరావుపేట గ్రామానికి చెందిన నాతం వేణు బైక్‌పై నర్సంపేట నుంచి బుధరావుపేటకు వెళ్తుండగా మండల కేంద్రం శివారు లోని ఎఫ్‌సీఐ గోదాముల వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొన డంతో వేణుకు తీవ్రగాయాలయ్యాయి. వేణును స్థానికులు చికి త్స కోసం 108లో నర్సంపేటకు తరలించారు.

కన్నుల పండుగగా దేవీ శరన్నవరాత్రులు

లలిత త్రిపుర సుందరిదేవిగా అమ్మవారు

నెక్కొండ, అక్టోబరు 7 : మండలంలోని రామలింగేశ్వరస్వామి, నెక్కొండ తండాల్లో నెలకొల్పిన అమ్మవారు సోమవారం ప్రత్యేక పూజలందుకున్నారు. బొడ్రాయి సమీపంలోని అంజనేయస్వామి ఆలయంలో భక్తులు మహాచండీ యాగం నిర్వహించారు. ఐదో రోజు అమ్మవారిని లలిత త్రిపుర సుందరి రూపంలో భక్తులు కొలి చినట్లు పూజారులు బీవీఎస్ శాస్త్రి, శ్రావణ్‌శాస్త్రి తెలిపారు. రామ లింగేశ్వరస్వామి, ఆంజనేయస్వామి ఆలయాల చైర్మన్ కే సుధాక ర్‌రెడ్డి, బెజ్జంకి వెంకటేశ్వర్లు, విగ్రహదాతలు మార్త రాజు రజిత, చల్ల ధర్మారెడ్డి రమాదేవి, రఘువీర్ శ్రీలేఖ, విజయ్-సరస్వతి దం పతులు, ధర్మకర్తల మండలి సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, గణేశ్, పెద్ద గోళ్ల రమేశ్, లైశెట్టి వినయ్, గంధం రాజు, సత్తిరెడ్డి పాల్గొన్నారు.


నెక్కొండలో పూజలు చేస్తున్న భక్తులు


అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న పెద్ది స్వప్న

దుగ్గొండిలో..

దుగ్గొండి : మండలంలోని తిమ్మంపేట లక్ష్మీనర్సింహాస్వామి దేవాలయంలో దుర్గామాతను సోమవారం బాల త్రిపుర సుంద రీగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే నాచినపల్లి రామాలయం, దుగ్గొండి, మల్లంపల్లిలో నెలకొల్పిన దుర్గామాత విగ్ర హాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అన్నదానాలు

గీసుగొండ : మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం దుర్గామాత అమ్మవారిని పలు రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూ జలు నిర్వహించారు. మనుగొండలో దుర్గామాత వేడుకల వద్ద కాంగ్రెస్ జిల్లా నాయకుడు రడం భరత్, ధర్మారంలో బొల్లం శివ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు పేర్ల శ్రావణ్, బొంద్యాలు, బాలరాజు, రంజిత్, విఠల్, ప్రవీణ్, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయంలో..

నర్సంపేట టౌన్ : పట్టణంలోని పోచమ్మ ఆలయంలో ఏర్పాటు చేసి దుర్గామాత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమా న్ని మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నాగిశెట్టి పద్మ, ప్రసాద్, పుట్ట నిర్మల, నా గిశెట్టి ప్రణీత, సుమలత, డాక్టర్ శీలం సత్యనారాయణ తదిత రులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రవీందర్

చేపల వ్యర్థాలతో సేంద్రియ ఎరువు

గీసుగొండ, అక్టోబరు 7: చేపల వ్యర్థాలతో సేంద్రియ ఎరువు, పురుగు మందుల ఔషధాల తయారీని వినూత్న రీతిలో చేపడుతున్నట్లు తెలంగాణ ఫిషరీష్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు చైర్మన్ పిట్టల రవీందర్ అన్నారు. గొర్రెకుంట మత్స్య సహకార మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఎరువు తయారు చేసే ప్రాజెక్టును సోమవారం ప్రా రంభించి మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణతో పాటు మత్స్యకారుల ఆదాయాన్ని పెం చేందుకు ఇది ఎంతగానో తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి పర్యావరణ సం స్థ అధ్యక్షుడు పి. మాధవరావు, చొప్పరి సోమయ్య, ప్రాజెక్టు కోఆర్డినేటర్ వినోద్‌కు మా ర్, మహిళా మత్స్య సహకార సంఘాల అధ్యక్షులు కందుల అశోక్, కళావతి, మత్స్య సహకార సంఘం డైరెక్టర్ కంబాల కోటి సంఘం జిల్లా ప్రతినిధులు పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం


బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

వర్ధన్నపేట రూరల్, అక్టోబరు 7 : బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని, ప్రధానమం త్రి నరేంద్రమోదీ దేశాన్ని ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తున్నట్లు జిల్లా సభ్యత్వ ఇన్‌చార్జి కుసుమ సతీష్, జిల్లా ఉపాధ్యక్షుడు పల్లె రఘునాథ్‌రెడ్డి అన్నా రు. సోమవారం మండలంలోని ఇల్లంద గ్రామంలో మండల సభ్యత్వ ప్రముఖ్ పంజా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బీజేపీ సభ్యత్వ నమోదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు లబ్ధి చేకూర్చడానికి పీఎం కిసాన్ యోజన పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సభ్యత్వ కార్యదర్శి జడ సతీష్, అధికార ప్రతినిధి కుందూరు మహేందర్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ బూడిద రమేష్, బొల్లం కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

లింగ సమానత్వం కోసం పాటుపడాలి


సమావేశంలో మాట్లాడుతున్న కవిరాజ్

సంగెం, అక్టోబరు 7: లింగ సమానత్వంతో కోసం పాటుపడాలని, చట్టాలపై మహిళ లు అవగాహన పెంచుకోవాలని సర్వోదయ ప్రాజెక్టు మేనేజరు కవిరాజ్ చెప్పారు. సో మవారం గవిచర్లలో సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మహిళలకు అవగా హన సదస్సులో ఆయన మాట్లాడారు. మహిళలపై జరుగుతున్న హింసలను నివారిం చేందుకు రక్షణ చట్టాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. గృహ హింస, వరక ట్నం, నిర్భయ, లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు, భ్రూణహత్యల నివారణకు కృషి చేయాలన్నారు. ఆర్గనైజేషన్ ట్రైనింగ్ కో ఆర్డినేటర్ ఇందిర, సిబ్బంది వాణి, అక్తర్, మహబూబ్‌పాషా, శరత్‌కుమార్, హేమలత, సంధ్య, జ్యోతి, రజిత పాల్గొన్నారు.

గోవర్ధన్‌కు బీఆర్ఎస్ నాయకుల పరామర్శ

నల్లబెల్లి, అక్టోబరు 7 : మూడు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు, తెలంగాణ ఉద్యమకారుడు కుందల గోవ ర్ధన్‌ను సోమవారం బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. మండల అధ్యక్షుడు బీ సారంగపాణి, పీఏసీఎస్ చైర్మన్ మురళీధర్‌రావు పరామర్శించిన వారిలో ఉన్నారు.

గీత కార్మికుడికి..

నల్లబెల్లి : మండలంలోని కన్నారావుపేట గ్రామానికి చెందిన తండా రాంబాబు గౌ డ్ ఇటీవల తాటిచెట్టుపై నుంచి పడి గాయపడ్డాడు. మోకుదెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసి డెంట్ అనంతుల రమేష్ సోమవారం రాంబాబును పరామర్శించారు. రాంబాబుకు వై ద్య ఖర్చుల కోసం వెంటనే రూ.15వేలు అందజేసి ఆదుకోవాలని రమేష్ కోరారు. ఈ కార్యక్రమంలో మోకుదెబ్బ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆరెల్లి శ్రీనివాస్‌గౌడ్, బోల్లోనిపల్లి గౌడ సంఘం మాజీ అధ్యక్షుడు జక్కి రాములు గౌడ్, బత్తిని అశోక్, పూజారి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సంగెంలో క్రషర్ల తనిఖీ


గాంధీనగర్‌లో క్రషర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

సంగెం, అక్టోబరు 7 : మండలంలోని క్రషర్ మిల్లులను సోమ వారం టాస్క్‌ఫోర్సు అధికారులు తనిఖీ చేశారు. జిల్లా అధికారుల అదేశం మేరకు వరంగల్ ఇన్‌చార్జి ఆర్డీవో కృష్ణవేణి, మాము నూరు ఏసీపీ తిరుపతి ఆధ్వర్యంలో తీగరాజులపల్లి శివారులోని గాంధీనగర్, పల్లార్‌గూడ గ్రామాల్లోని మూడు క్రషర్లను పరిశీ లించారు. ఇటీవల క్రషర్ల తో ప్రజలకు జరుగుతున్న ప్రమా దాల నేపథ్యంలో తనిఖీ చేశారు. యజమానులకు పలు జాగ్రత్తలు సూచించారు. ఈ కార్యక్రమంలో సంగెం తహసీల్దార్ రాజ్‌కుమార్, మైనింగ్ ఏడీ రవిశంకర్, డీఈ ఇరిగేషన్ గణేష్, ఎంపీవో కొమురయ్య, ఎస్సై నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ వేడుకలకు ఏర్పాట్లు

దుగ్గొండి, అక్టోబరు7: ఈ నెల 10 నిర్వహించే బతుకమ్మ వేడుకలకు సోమవారం కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు గ్రామాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. మహి ళలు బతు కమ్మ ఆడే స్థలాలను గుర్తించి చెత్తాచెదారాన్ని తొలగించారు. నాచినపల్లిలో గ్రామ ప్రత్యేక అధికారి శ్రీధర్, కార్యదర్శి ఆనంద్ గ్రామస్థుల సహకారంతో ఏర్పాట్లు చేశారు.

చెన్నారావుపేటలో..

చెన్నారావుపేట : మండల కేంద్రంలో బతుకమ్మ మోరీ వద్ద సోమవారం అధికారు లు జీపీ సిబ్బందితో శుభ్రం చేయించారు. రోడ్డుకు ఇరువైపుల పిచ్చి మొక్కలు తొలగిం చారు. మోరీ వద్ద బతుకమ్మ నిమజ్జనానికి ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో కా ర్యదర్శి రంజిత్, సిబ్బంది తదితరులున్నారు.


నాచినపల్లిలో బతుకమ్మ వేడుకలకు ట్రాక్టర్‌తో శుభ్రం చేయిస్తున్న గ్రామస్థులు